క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి

భీమడోలు: ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని దాబా యాజమానులంతా సమయపాలన పాటించాలని, లేని పక్షంలో ఎన్నికల ఉల్లంఘన కేసులు నమోదు చేస్తామని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన ఆదివారం రాత్రి దాబా యాజమానులతో సమావేశమై ఎన్నికల నిబంధనలు, పని వేళలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌కు మరో 9 రోజుల గడువు ఉన్నందున గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో దాబాలు రాత్రి 10.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి హోటల్ వద్ద సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా దాబా యాజమానులు పోలీసులకు సహకరించాలన్నారు. మండలంలోని జాతీయ, రాష్ట్రీయ రహదారులతో పాటు గ్రామాల్లోని దాబా యాజమానులు నిబంధనలను పాటిస్తూ తమ కార్యకలాపాలు సాగించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అప్పనవీడులోని అభయాంజనేయస్వామి

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. హనుమజ్జయింతిని పురస్కరించుకుని ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అర్చన ఉదయం 6గంటలకు దాతల గోత్రనామాలతో పూజలు, ఉదయం 7గంటలకు 1008 గులాబి పూలతో ప్రత్యేక పూజ, ఉదయం 9గంటలకు భజన, సుందరకాండ పారాయణ, సాయంత్రం 6గంటలకు వెండి బంగారు పుష్పాలతో స్వామివారికి ప్రత్యేక పూజ, నక్షత్ర హారతి అందిస్తారు. జై హనుమాన్ భజన మండలి హనుమాన్ జంక్షన్ వారితో కోలాటం ప్రదర్శన, అనంతరం రఘు మ్యాజిక్ షో, మిమిక్రీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాత్రి 9గంటలకు స్వాతి ఆర్కెస్ట్రా భీమవరం వారితో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నగరీకరణతో... క్రీడాశిక్షణలో న్యూ ట్రెండ్

- ఈతకొలనుల్లో చిన్నారుల సందడి
- ఏలూరులో యువతకు అందుబాటులో నెట్ గ్రౌండ్లు
- విద్యుత్ వెలుగుల్లో క్రికెట్ శిక్షణ


ఏలూరు మినీ బైపాస్‌లో నెట్ గ్రౌండ్‌లో విద్యుత్ వెలుగుల్లో క్రికెట్ శిక్షణ


ఏలూరు మినీబైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన నెట్ గ్రౌండ్


స్విమ్మింగ్ పూల్‌లో ఉల్లాసంగా ఈత నేర్చుకుంటున్న చిన్నారులు


పిల్లలను స్విమ్మింగ్‌కు తీసుకువచ్చిన తల్లిదండ్రులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో క్రీడాశిక్షణలో న్యూ ట్రెండ్ యువత, చిన్నారులను ఆకర్షిస్తోంది. నగరంలోని అనేక ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిన నేపథ్యంలో యువత, చిన్నారులకు సరైన ఆట స్థలాలు కరువయ్యాయి. ఒకవైపు కార్పొరేట్ విద్యా విధానంలో నిత్యం ఒత్తిడితో కూడిన విద్య. మరోవైపు సరైన శారీరక వ్యాయామం లేకుండా పిల్లలు త్వరగా అనారోగ్యం బారిన పడుతున్నారు. నగరాల్లో ఇటీవల కాలంలో సరికొత్త ట్రెండ్ తీసుకువచ్చారు. విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఏర్పాటు చేస్తున్న నెట్ క్రికెట్ గ్రౌండ్స్ యువత, చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల ఏలూరు నగరంలోనూ ఇదే తరహాలో ఫుడ్‌జోన్‌తో పాటు పిల్లలకు రకరకాల ఆటలు, నెట్ క్రికెట్, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు.

ఆటలకు 'వల'

నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో న్యూ ట్రెండ్‌లో క్రికెట్, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఖాళీ స్థలాలను అద్దెలకు తీసుకుని యువత, చిన్నారులకు అనుకూలంగా నెట్ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నారు. గేమ్ ఆన్, హ్యాట్రిక్ స్పోర్ట్స్, వెంకీ మామ క్రికెట్ కోర్టు ఇలా పలు పేర్లతో వీటిని నిర్మించారు. ఈ తరహా నెట్ క్రికెట్‌కు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వేసవి కావటంతో చిన్నారులు, యువత పాల్గొని సెలవులను ఆనందంగా గడుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఉల్లాసంగా ఆటలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. అనంతరం స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ... చల్లచల్లగా కాలక్షేపం చేయటంతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.

న్యూ ట్రెండ్‌కు డిమాండ్

ఏలూరులో కొత్తగా ఏర్పాటు చేసిన నెట్ క్రికెట్, స్విమ్మింగ్ పూల్స్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. నిర్వాహకులు గంటకు స్లాట్ బుక్ చేసుకునేలా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ యువత ఆటల్లో మునిగి తేలుతున్నారు. నిర్వాహకులైన యువతకు ఉపాధి లభిస్తుండగా, ఆటలు ఆడుకునే వారికి శారీరక వ్యాయామం, ఉల్లాసాన్ని ఇస్తోంది. చెడు అలవాట్లు, వ్యాపకాల వైపు యువత దృష్టి మరలకుండా ఆటలు ఆడుతూ గడపటం శుభపరిణామమే అంటున్నారు తల్లితండ్రులు.

ఆదరణ బాగుంది



పిల్లలు, యువత ప్రతి రోజూ క్రికెట్ ఆడుకునేందుకు స్లాట్స్ బుక్ చేసుకుంటున్నారు. తమ పిల్లలతో తల్లిదండ్రులు కలిసి వచ్చి ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో పిల్లలకు శారీరక వ్యాయామం అందుతోంది. రాత్రి వేళల్లోనూ చల్లని వాతావరణంలో కుటుంబంతో వచ్చి సరదాగా గడుపుతున్నారు. మాకు ఉపాధి లభించటంతోపాటు, యువతకు ఉపయోగకరంగా ఉంటోంది. – సతీష్, హ్యాట్రిక్ స్పోర్ట్స్, ఏలూరు

రోజూ ఆటలు ఆడుకుంటున్నాం



మా అన్నయ్య, ఫ్రెండ్స్‌తో కలిసి వచ్చి రోజూ క్రికెట్ ఆడుకుంటున్నాం. చాలా సరదాగా గడుపుతూ, ఆటలు ఆడుకుని చెమటలు పట్టిన అనంతరం, మళ్లీ కొంతసేపు స్విమ్మింగ్ చేసి ఇంటికి వెళుతున్నాం. ఏలూరులో పెద్ద గ్రౌండ్స్ లేవు. రెండు, మూడు ఉన్నా వాటిలో ఖాళీ ఉండడం లేదు. ఇక్కడ నెట్‌లో క్రికెట్ ఆడుకోవటం చాలా బాగుంది. – కిషోర్, బాలుడు

విజిట్ రిజిస్టర్ల నిర్వహణపై జేసీ సంతృప్తి


ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద విజిటర్ల రిజిస్టర్ నిర్వహణపై జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బి.లావణ్యవేణి సంతృప్తి వ్యక్తం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద విజిటర్ల రిజిస్టర్ అత్యంత కీలకమన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌కి మూడంచెల భద్రత, సీసీ కెమెరాలు, తాళాలకు సీళ్లతో పాటు అతి ముఖ్యమైనది విజిటర్ల రిజిష్టరేనన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు

పెదవేగి : దుగ్గిరాల్లో సోమవారం నుంచి నాలుగు రోజులు పాటు సువార్త స్వస్థత సభలు నిర్వహిస్తున్నట్లు హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ ఈడి కృపదానం తెలిపారు. ఆదివారం ఆయన దుగ్గిరాల్లో మాట్లాడుతూ పెదవేగి మండలం దుగ్గిరాలలోని పర్వతనేని బాబ్జి స్థలంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటలకు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సువార్త సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ ఎస్ రాజశేఖర్, పాస్టర్ జెర్మియా, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ క్రాంతి పాల్ పాల్గొంటారని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు అందుబాటులో వసతి గృహాలు

దెందులూరు: దివ్యాంగులైన శారీరక వైకల్యం, దృష్టి లోపం, మూగ, చెవుడు, బధిరులు మూడవ తరగతి నుంచి పీజీ స్థాయి వరకు చదువుతున్న వారికి ఏలూరు కోటదిబ్బ ప్రాంతంలో వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, డిప్యూటీ కలెక్టర్ పి.రాకడమణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్‌లో చేరేవారు, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరేవారే విభిన్న ప్రతిభావంతులు వసతి పొంది విద్యనభ్యసించవచ్చన్నారు. ఒక్కసారి 3వ తరగతిలో ప్రవేశం పొందిన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోస్టు గ్రాడ్యుయేట్ వరకు వసతి పొందవచ్చనన్నారు. ఈ వసతి గృహంలో ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజన వసతితో పాటు నాలుగు జతల దుస్తులు, దుప్పట్లు, ట్రంకు పెట్టె, నోటు పుస్తకాలు, ప్రతి రోజూ కోడిగుడ్డు, వారంలో రెండు, మూడు రోజులు చికెన్‌తో భోజనం అందిస్తామన్నారు. కాస్మొటిక్స్ ఛార్జీలు కింద 3వ తరగతి నుంచి 6వ తరగతి వరకు విద్యనభ్యసించే బాలురకు నెలకు రూ.175, బాలికలకు రూ.130 చెల్లిస్తామన్నారు. 7వ తరగతి నుంచి ఉన్నత విద్యనభ్యసించే యువకులకు నెలకు రూ. 200, యువతులకు రూ.200 చెల్లిస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా సాఫ్టనర్సులు కూడా ఉన్నారన్నారు. జిల్లాలో దివ్యాంగులైన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాకడమణి కోరారు. మరిన్ని వివరాలకు 8142938379, 9394004882 నంబర్లకు వివరాలు అడిగి తెలుసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు నేరుగా వచ్చి వసతి గృహాలను సందర్శించవచ్చనన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు

భీమడోలు: విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ అందించారు. గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు ధర్మరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వృద్ధి

పెదవేగి : వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని పెదవేగి శాఖ గ్రంథాలయం గ్రంథపాకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం పలువురు విద్యార్థులు గ్రంథపఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో గ్రంథపఠనం ఒక భాగం కావాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి ఉన్నతమైన జీవితాన్ని అందుకుంటారని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పి ప్రసాద్ పలు అంశాలను విద్యార్థులకు వివరించారు.

లయన్స్ సేవలను విస్తరించాలి


లయన్స్ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ సేవలను ప్రతి పల్లెటూరికి, ప్రతి సామాన్యుడికి చేరేలా విస్తరింపజేయాలని అందుకు కావలసిన ఏర్పాట్లకు లయన్స్ సేవా కో-ఆర్డినేటర్లు సహకరించి సేవలందించాలని ఎమ్మెల్సీ, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. 2024–25 సంవత్సరపు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, క్లబ్ ఆఫీసర్ల శిక్షణ శిబిరం ఏలూరు గ్రీన్‌సిటీలోని లయన్స్ భవనంలో జిల్లా 316 జి గ్లోబల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ అధి నాయకుడు నందుల సీతారామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ సేవలను గ్రామ స్థాయిలోకి విస్తరించడంతో పాటు క్లబ్‌లను ఏర్పాటు చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ముందుగా లయన్స్ సంస్థ పితామహుడు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు జులై నుంచి కాబోయే క్లబ్ నాయకులైన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, అడ్మినిస్ట్రేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం సంతోషించదగ్గ విషయమన్నారు. 2024–25 జిల్లా గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టే కాకరాల వేణుబాబు మాట్లాడుతూ లయన్స్ కంటి ఆసుపత్రులు, డయాలసిస్ సెంటర్లు, శాశ్వత ప్రాజెక్టులుగా పిలవబడే వివిధ రకాల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ఫ్యాకల్టీ, పూర్వపు జిల్లా గవర్నర్లు డాక్టర్ పి.విజయభాస్కరరెడ్డి, వి.మురళీమోహనరావు, జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, వీ.రామారావు, వీ.సత్యస్వరూప్, ఎల్. వెంకటేశ్వరరావు, వీవీ స్వామి పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ వ్యవహరించగా రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్, వి.రత్నకుమార్ కార్యక్రమానికి ఆతిథ్యాన్ని అందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల హక్కులపై దాడి ఆపాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆర్టీసీ ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కులపై దాడి ఆపాలని, ఎస్‌డబ్ల్యూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. కార్మిక ఉద్యోగ ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఏపీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలో లేని అంశాన్ని ఆధారంగా చేసుకొని ఆర్టీసీ నాయకులు సుందరయ్యను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని, చిన్న చిన్న కారణాలతో ఉద్యోగులను యథేచ్ఛగా సస్పెన్షన్లు చేయడం తగదన్నారు. వేధింపులు ఆపకపోతే కార్మిక, ఉద్యోగ సంఘాలు ఉద్యమించక తప్పదని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడటం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధం కాదని, ఇది ఉద్యోగుల హక్కులపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. సుందరయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా ఎన్నికల కోడ్ పేరుతో ఆర్టీసీ యాజమాన్యం ఎలా చర్యలు తీసుకుంటుందన్నారు. తక్షణమే సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్షుడు బి.జగన్నాథరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు కె.విజయలక్ష్మి, పిల్లి రామకృష్ణ, ఎ.శ్యామలా రాణి, జె.గోపి, వీపీయస్ ప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	01
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	04, 06
బెండకాయలు	48	కంద	60
పచ్చిమిర్చి	80-88	బీట్‌రూట్	36
కాకర కాయలు	54	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-56	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	44

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


భీమడోలులో విశేషాలంకరణలో సాయిబాబా


నవగ్రహ దేవతల నృత్యరూపకంలో బాలికలు

భీమడోలు: భీమడోలులో ప్రసిద్ధిగాంచిన సద్గురు షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం 27వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయిబాబాను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సాయి నామ సంకీర్తనలతో ఆలయ ప్రాంతమంతా మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య భజన మండలి వారితో కోలాటం నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డి.సూర్యనారాయణరాజు, ఎం.లక్ష్మణరావు, జి.భాస్కరరావు, పుప్పాల వెంకటేశ్వరరావు, వై.వీరరాఘవులు, తుమ్మల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణంలో జాప్యం


అండర్‌పాస్‌పై రేకు ఏర్పాటు చేయని దృశ్యం

దెందులూరు : దెందులూరు– అలుగులగూడెం గ్రామాల మధ్య రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిర్మించిన అండర్‌పాస్ నాలుగు మండలాల ప్రజల ప్రయాణానికి ఎటువంటి అసౌకర్యం లేకుండా పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుంది. అండర్‌పాస్‌కు రెండు వైపులా పైకప్పు భాగంలో ఖాళీగా ఉంచారు. జూన్ నుంచి వర్షాకాలం కావడంతో వర్షం నీరంతా కిందకు దిగి రెండువైపులా సెంటర్ ప్రాంతానికి చేరి చెరువులా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలు అంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వర్షాకాలం ప్రారంభం కాకముందే పైకప్పు భాగంలో రేకులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.